క్లుప్తంగా

ఘనంగా పెన్షనర్ దినోత్సవం


డీఎస్ నక్రా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పెద్దశంకరంపేట(మెదక్): పెన్షనర్ డేను పురస్కరించుకొని శనివారం మండల విశ్రాంత ఉద్యోగులు పెన్షనర్ దినోత్సవాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో పెన్షనర్ పితామహుడు డీఎస్ నక్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షులు ఎస్ నర్సింలు, ప్రభాకర్‌రావు, శాంతకుమారి, నారాయణ, దశరథ్, శంకరయ్య, సంగారెడ్డి, మోహన్, పురుషోత్తం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రైనేజీ పనులు


కాళ్లకల్ 12వ వార్డులో నిలిచిన పనులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో 12 వార్డులోని పలు వీధుల్లో కాంట్రాక్టర్ అండర్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలేశాడు. నెలలు గడుస్తున్నా.. కాలనీ వాసులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కాగా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి, సీసీ రోడ్లు వేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దు


మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులను టీవీలకు దూరంగా ఉంచడంతో పాటు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని దొంతి పాఠశాల హెచ్‌ఎం రవి అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. రానున్నది పరీక్షల కాలం ఉన్నందున విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయి దృష్టి పెట్టేలా ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద టీవీ, సెల్ ఫోన్లకు దూరంగా ఉండేలా చూస్తూ హోం వర్క్, ప్రాజెక్టు వర్క్ పూర్తి చేసేందుకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, శారద, రాధ, నాగేశ్వర్‌రావు, గౌరీశంకర్, మాలతి, ఉమాకుమారి, సూర్య, రామిరెడ్డి, గోవర్దన్, తదితరులు ఉన్నారు.

కార్మికులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): భవన నిర్మాణ రంగ కార్మికులు నైపుణ్యాన్ని పెంపొందించుకొని తమ రంగంలో రాణించాలని భవన నిర్మాణ సంక్షేమ మండలి సమన్వయ కర్తలు రామకృష్ణాచారి, ఐలయ్య అన్నారు. శనివారం పేటలోని రైతువేదికలో గుర్తింపు కలిగిన భవన నిర్మాణ రంగ కార్మికులకు న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మాణ రంగంలో సాంకేతికత ఎంతో అవసరమని, దీని ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఈ శిక్షణను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికులకు దినసరి భత్యం, మధ్యాహ్న భోజనం ఇతర సదుపాయాలు కల్పించారు.

పుస్తకాల పంపిణీ

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని యునిమోని సీఈఓ కృష్ణన్ శనివారం దాయర వీధిలోని ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెదక్ బ్రాంచి మేనేజర్ నర్సింలు, నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు రాక.. పనులు సాగక

- నిలిచిన మండల సమీకృత భవన నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


స్లాబ్ దశలోనే నిలిచిన పనులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని సమీకృత భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నూతన మండలం మనోహరాబాద్‌లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా మండలం సమీకృత భవనాల నిర్మాణాలను అప్పటి ఆర్థిక, వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావు రూ. 5 కోట్లతో ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు స్లాబ్ స్థాయిలోనే పనులు అలాగే ఉన్నాయి. మండలంలోని దండుపల్లి గ్రామ పంచాయతీ శివారులో అసైన్డ్ భూమి 4.30 ఎకరాల భూమిలో 2022 మే 15న మంత్రి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులను నెమ్మదిగా సాగదీస్తున్నారు.

స్లాబ్ దశలోనే పనులు

పనులు నిల్చిపోయి నెలలు గడుస్తున్నా.. స్లాబ్ దశలోనే పనులు ఆగిపోయాయి. పంచాయతీ రాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు వీటిని పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు ప్రారంభమయ్యేలా దృష్టి సారించాలని కోరుతున్నారు. రెవెన్యూ భవనం శిథిలావస్థలో ఉంది. మండల పరిషత్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. అద్దె పాట్లు తప్పేలా అధికారులు చర్యలు చేపట్టాలి. మండల సమీకృత భవనాన్ని త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.


అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవన నిర్మాణం

ఇబ్బందులు పడుతున్నాం



అన్ని భవనాలు ఒకే ప్రాంగణంలో ఉంటే అందరికీ సమయం ఆదా అవుతుంది. కానీ పనులు ఆగిపోవడంతో ప్రజలకు ఇక్కట్లు పడుతున్నారు.
– గానుగు రాజు, కాళ్లకల్ గ్రామస్తుడు

నిధులు రాగానే పనులు ప్రారంభం

నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కాగా నిధులు కోసం పై అధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను ఆపేశాడు. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతాం.
– పీఆర్ ఏఈ మధు, మనోహరాబాద్

రైతులు వరి వ్యర్థాలను కాల్చొద్దు

- మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ


పంట చేనులో వ్యవసాయ అధికారి, రైతులు

రామాయంపేట(మెదక్): రైతులు తమ పంట చేనులో పంట ఉత్పత్తులకు సంబంధించి వ్యర్థాలను కాల్చొద్దని, దీనితో రైతుకు నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ అన్నారు. శనివారం ఆయన పట్టణ శివారులో పలు పంటచేలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు వరి పంటను కోసే క్రమంలో నేల అడుగుభాగం వరకు మొక్కను కోయాలని సూచించారు. చాలా మంది రైతులు కాండాన్ని 30 నుంచి 40 సెంటీమీటర్ల మేర వదిలి వరిపంటను కొస్తున్నారని, ఇది నష్టదాయకమని పేర్కొన్నారు. వరిచేలో పంట వ్యర్థాలను కాలిస్తే పంటకు మేలు చేసే క్రిమికీటకాలు, వానపాములు చనిపోవడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బన పదార్థం తగ్గి భూసారం దెబ్బతింటుందని హెచ్చరించారు. దీనితో పాటు నత్రజని, భాస్వరం, పోటాషియం, సూక్ష్మ పోషకాలైన జింక్, ఇతర పోషకాల లభ్యత తగ్గి పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. వదిలిన వరి కొయ్యలను అలాగే కలియ దున్నడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బన పదార్థం పెగిరి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయికృష్ణ, రాజు, రైతులు పాల్గొన్నారు.

మినీ ఫంక్షన్‌హాల్ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శనివారం మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు సొంత నిధులతో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకపోయినా నిత్యం ప్రజల కోసం పనిచేస్తానని తెలిపారు. గతంలో ఇబ్రహీంపూర్ గ్రామంలోని ముదిరాజ్ సోదరులకు ఇచ్చిన హామీ మేరకు మినీ ఫంక్షన్‌హాల్ నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. చేగుంట మండల ప్రజల అభిమానం ఎప్పటికీ మరువలేదన్నారు. మండల ప్రజలకు అండగా ఉండి తన వంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, మాజీ సర్పంచ్‌లు నాగభూషణం, రఘువీర్‌రావు, స్వామితో పాలు ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ కోసం బారులు



గ్యాస్ డీలరు కార్యాలయం వద్ద బారులు దీరిన వినియోగదారులు

నర్సాపూర్: గ్యాస్ డీలరు వద్ద ఈకేవైసీ కోసం అవే బారులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ డీలరు శ్రీనివాస్ కార్యాలయంలో ఈకేవైసీ కోసం వినియోగదారులు రోజూ ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. దీంతో గ్యాస్ ఆఫీసు వద్ద బారులు తీరుతున్నారు. ఆఫీసుకు రావద్దని డీలరు చెప్తున్నా.. వారు వినకుండా ఆఫీసు రావడం, బారులు తీరడం పరిపాటిగా మారింది. కాగా తమ ఆఫీసుకు వచ్చిన వినియోగదారుల థంబ్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపామని ఆయన చెప్పారు.

అందరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- సద్గురు సోమలింగ శివాచార్య మహాస్వామి


ఆలయంలో ప్రవచనమిస్తున్న సద్గురు సోమలింగ శివాచార్య మహాస్వామి

చిన్నశంకరంపేట(మెదక్): అందరూ భక్తిభవాన్ని అలవర్చుకోవాలని సద్గురు సోమలింగం శివాచార్య మహాస్వామి అన్నారు. శనివారం మండలంలోని చందంపేట గ్రామంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొని భక్తులకు ప్రవచనం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు హిందూ సంప్రదాయాన్ని పాటించాలని కోరారు. ప్రతీ ఒక్కరు ప్రతీరోజు దైవచింతనతో దేవాలయం సందర్శించాలన్నారు. దైవ నామస్మరణ చేస్తే మానసిక ప్రశాంతత పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్, ఎంపీటీసీ శివకుమార్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, ముత్యాలు, మల్లేశం, నవీన్‌గౌడ్, యాదగిరి, ప్రవీణ్‌కుమార్, నరేశ్, స్వామి, నరేశ్, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

ఆంజన్న సన్నిధిలో భక్తుల సందడి


ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తజన సందడి నెలకొంది. శనివారం అర్చకులు ఆంజనేయస్వామికి మన్నె సూక్త పారాయణం, సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన గురుస్వామి సత్యనారాయణగౌడ్ నివాసంలో పడిపూజ చేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు ప్రత్యేక పూజలు చేపట్టారు. అయ్యప్ప కీర్తనలతో ఈ ప్రాంతం మారుమోగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.


అయ్యప్ప పడిపూజలో భక్తులు

మైనార్టీ మండల నూతన కార్యవర్గం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో శనివారం ముస్లిం మైనార్టీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మైనార్టీ అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడిగా రఫిక్, ప్రధాన కార్యదర్శి ఫాజిల్, కోశాధికారి అబ్దుల్, సలహాదారుడు మైనోద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు అబ్దుల్ పాషా, షాదుల్, ఇక్బాల్, మహబూబ్, పాషా బాయ్, బాబు మియా, సాజిత్, జాఫర్, తలహ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

18న చిన్నశంకరంపేటలో మండల సమావేశం

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో 18న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరగనుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సమావేశానికి సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో 18న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈనెల 18న ఉదయం 11.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు అవుతారని చెప్పారు. మండలంలోని ఎంపీటీసీలు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

లారీ ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): లారీ ఢీకొన్న సంఘటనలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల చిన్నగొట్టిముక్ల చౌరస్తా తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన మధిర నిర్మల భర్త చనిపోవడంతో 8 ఏళ్ల కొడుకు రోహిత్‌తో కలిసి భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. శనివారం ఉదయం చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద భిక్షాటన కోసం కొడుకుతో కలిసి వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ నుంచి తూప్రాన్ వైపుకు వెళ్తున్న లారీ చిన్నగొట్టిముక్ల చౌరస్తా వద్ద రోహిత్‌ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రోహిత్‌కు తీవ్రగాయలు స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి


బీఎల్ఓలతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సింధూజ

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి ఓటరు జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సింధూజ అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పొప్పులు లేకుండా చూడాలన్నారు. జనవరి 1న 2024 వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. గ్రామంలో ఓటు హక్కుపై పూర్తిస్థాయి అవగాహన వచ్చేలా బీఎల్ఓలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి


నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

నర్సాపూర్: ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని చౌరస్తాలో ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాస్, భిక్షపతి తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకంతో ఆటోలకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పథకంతో ఆటో డ్రైవర్లకు నష్టం వాటిల్లుతున్నందున ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో అనంతరం ఆర్డీఓ ఆఫీసు వరకు ర్యాలీగా వెళ్లి ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. రాస్తారోకోలో నాగరాజు, శ్రీనివాస్, భిక్షపతిలతో పాటు నాగభూషణం, రాజు, ఆంజనేయులు, కుమార్, సత్యనారాయణ, మోసిన్, అలీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డలు సురక్షితం

వెల్దుర్తి(తూప్రాన్): పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డలు సురక్షితంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు ఎల్లప్పుడు వైద్యుల సూచన మేరకు ఆరోగ్య, ఆహార నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, దేవలత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన రంగు ప్రదీప్‌గౌడ్, కిచ్చుగారి పాండు, ఎర్రవల్లి భాను, మధు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ డిపో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి బస్సు సౌకర్యం నిలిచిపోయిందని వాపోయారు.